క్లుప్తంగా

వేగవంతంగా కుల గణన సర్వే



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వేను అధికారులు వేగవంతం చేశారు. సోమవారం తెనాలి పట్టణంలో అన్ని వార్డులలో దీనిని నిర్వహించారు. వార్డు వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి వారి కులాల వివరాలు నమోదు చేసి ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయించారు. ఈనెల 28వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



అన్నవరపులంక(కొల్లిపర): మండలంలోని అన్నవరపులంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు పులగం మహేష్ బాబు, సుజాత కలసి రూ.20 వేలు విలువ చేసే లేజర్ ప్రింటర్‌ను సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థి పాటి శ్రీరాం ద్వారా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.మల్లేశ్వరరావు తెలిపారు.

రేపు వైఎస్సార్ ఆసరా

కొల్లిపర: వైఎస్సార్ ఆసరా మండల స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక అవుతు రామిరెడ్డి కళాశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఏపీఎం ప్రియదర్శిని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జెడ్పీ చైర్మన్ హెనీ క్రిస్టినా హాజరవుతారన్నారు. మండలంలోని డ్వాక్రా సంఘ సభ్యులు, యానిమేటర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

25న మండల సర్వసభ్య సమావేశం

కొల్లిపర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 25న మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. హాజరు కాని వారిపై తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కృష్ణనగర్ 5వ లైనులో నిర్మాణంలో ఉన్న భవన వాచ్‌మన్ కాశయ్యతో పక్కనే నివాసం ఉండే చిట్యాల రవికిరణ్ గొడవపడ్డాడు. కాశయ్యను కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంపత్‌నగర్ 5వ లైనులో నివాసం ఉండే పి.వెంకటేష్ (23) సోమవారం షోడా బండికి విద్యుత్ చార్జింగ్ పెడుతూ ప్రమాదవశాత్తు షాక్ తగిలి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

గుంటూరు రూరల్: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో తల్లీ బిడ్డలు గాయాల పాలయ్యారు. సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. దాసరిపాలెంకు చెందిన ఉప్పులూరి నాగమ్మ, ఆమె కుమార్తె స్పందనలు ద్విచక్రవాహనంపై నగరంలో పని నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో దాసరిపాలెం సమీపంలో ఒంగోలు నుంచి గుంటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు వారిని ఢీకొంది. ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

స్టేడియంలో జిమ్ సెంటర్లు

నెహ్రూనగర్: ఎన్టీఆర్ స్టేడియంలో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా జిమ్ సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన గెజిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. గత సంవత్సరం స్టేడియంలో 312 చదరపు మీటర్లలో రెండు ఫ్లోర్ల నిర్మాణాన్ని నగరపాలక సంస్థ చేపట్టింది. వాటిల్లో క్రీడాకారులకు ఫిట్‌నెస్ కోసం పురుషులకు, మహిళలకు వేర్వేరుగా జిమ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ ప్రభుత్వానికి ప్రపోజల్ పంపారు.



రజకపేటలోని రామమందిరంలో పూజలు చేస్తున్న రాజకుమారి,కౌన్సిలర్‌లు



సీతారామాంజనేయ దేవస్థానంలో..



మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా విగ్రహ ప్రతిష్ఠను తిలకిస్తున్న బీజేపీ నాయకులు

రామ రసామృతంలో భక్తకోటి



రథం ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



గోవర్ధనస్వామి ఆలయంలో సంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

- భక్తులతో కిటకిటలాడిన రామ మందిరాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- రామనామ స్మరణతో మారుమోగిన రామమందిరాలు

తెనాలిటౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం పట్టణంలోని రామ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. మందిరాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. రామ నామ స్మరణతో రామమందిరాలు మార్మోగాయి. శ్రీరాముని విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో ప్రదర్శనలు చేశారు. మార్కెట్ సెంటర్‌లో దొంగరాముని గుడి వద్ద బీజేపీ నాయకులు స్క్రీన్ ఏర్పాటు చేశారు. అయోధ్యలో జరుగుతున్న బాలరాముని విగ్రహ ప్రతిష్టను భక్తులు, బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, అవ్వారు శ్రీనివాస్, తదితరులు తిలకించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్తలు, ఈవోలు పాల్గొన్నారు.

- వైకుంఠపురంలోని లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుంభం సాయిబాబు, ఈవో తిమ్మానాయుడు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



భక్తులకు కేసరి, పులిహోర పంపిణీ

- రజకపేటలోని రామాలయంలో భక్తులు విశేష పూజలు జరిపారు. పూజల్లో మహిళా కమిషన్ మాజీ చైరపర్సన్ నన్నపనేని రాజకుమారి, కౌన్సిలర్లు వీర్లపాటి విజయలక్ష్మి, గొడవర్తి సాయిహరేరామ్, భక్తులు పాల్గొన్నారు.
- మారీసుపేటలోని అప్పలస్వామి గుడిలో ఆలయ ట్రస్టీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి రథాన్ని ఊరేగింపు జరిపారు.భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.మహిళలు ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి పూజలు జరిపారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.
- ఐతానగర్‌లోని రాముల వారి గుడిలో పూజలు జరిపారు. ముక్కాల మురళీకృష్ణ ప్రసాద్,లక్ష్మి దంపతులు పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం అందజేశారు.
- రూరల్ మండలం నందివెలుగులో ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూళిపాళ్ల నరేంద్రకుమార్, బీజేపీ నాయకుడు తోటకూర కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్, పానకాల రావు, ఎ.వెంకటరావు, రాఘవేంద్ర, పంతులు రామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.
- పట్టణ 15వ వార్డులో రాములవారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, అనంతగిరి శంకర్, మేడేపల్లి ప్రభాకర్, వెంకట్రావు పాల్గొన్నారు.
- గోవర్ధనస్వామి ఆలయంలో కొండపి వసుంధర ఆధ్వర్యంలో మహిళలు సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

భక్తులకు కేసరి, పులిహోర పంపిణీ

తెనాలిఅర్బన్: అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా వాసవి క్లబ్ తెనాలి వారి ఆధ్వర్యంలో నెహ్రూరోడ్డులోని గోవర్ధన స్వామి దేవస్థానం వద్ద సోమవారం భక్తులకు కేసరి, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గోనుగుంట్ల జయంత్ కుమార్, క్లబ్ అధ్యక్షులు ఓబులుశెట్టి రమేష్, సుబ్బారావు, గొడవర్తి మల్లిఖార్జునరావు, రఘునాథబాబు, అడపా సంపత్, గుప్త తదితరులు పాల్గొన్నారు.



నందివెలుగులోని ఊరేగింపులో..



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో..



వైకుంఠపురంలో పూజలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ

తెనాలి: ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమగ్ర విద్య కోసం ప్రభుత్వం అందజేస్తున్న విద్యా అవసరాల్లో భాగంగా మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ సోమవారం సాయంత్రం ఇద్దరు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. రూరల్ మండలం ఖాజీపేట జెడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న వినికిడిలోపం కలిగిన కె.నాగేంద్రవరుణ్, తెనాలి గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్న దృష్టిలోపం కలిగిన కె.బాలమణికంఠకు వీటిని అందజేశారు. ఎంఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న బాలాజీరావుపేట భవిత సెంటర్లోని విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం సహాయ పరికరాలు, బోధనాభ్యసన సామగ్రి, ఎస్కార్ట్ అలవెన్సులు అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. ఇందులో భాగంగానే అత్యంత నాణ్యత కలిగిన ట్యాబ్‌లను అందజేశామన్నారు.



ట్యాబ్‌లు అందజేసిన ఎంఈవో లక్ష్మీనారాయణ

వీరికి డిజిటల్ విధానం ద్వారా అభ్యసన సామర్థ్యాలను పెంచుకునేలా బోధన జరుగుతుందన్నారు. సమ్మిళిత విద్యలో భాగంగా వైకల్యం కలిగిన వారు సైతం స్క్రీన్ చూడటం, వినడం ద్వారా పాఠాలను చక్కగా నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో-2 జయంత్‌బాబు సూచించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయినులు వై.రాజకుమారి, డి.సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అక్కినేని

వర్ధంతి సభలో వక్తలు

తెనాలి: పట్టణానికి చెందిన స్వరలయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు 10వ వర్ధంతి సదస్సును నిర్వహించారు. స్థానిక మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటైన సదస్సులో అక్కినేని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అక్కినేని జీవిత విశేషాలను సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. బాలనటుడిగా, స్త్రీ పాత్రల్లో నటిస్తూ సినీరంగ ప్రవేశం చేసిన అక్కినేని తన అభినయ కౌశలంతో నటసామ్రాట్‌గా పిలిపించుకున్నారని చెప్పారు. 256 సినిమాల్లో నటించారని, 'మనం' సినిమా చివరిదని అన్నారు. తెలుగు సినిమా ఉన్నంతకాలం ఆయన చిరస్మరణీయులని చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులను అందుకున్న గొప్ప నటుడని తెలిపారు. శ్రీధర్, నటులు మల్లేశ్వరరావు, హేమాచారి, పినపాటి సురేష్‌బాబు, రొంపిచర్ల సురేష్, జవ్వాది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



అక్కినేని చిత్రపటానికి నివాళి

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

చేబ్రోలు: పేద విద్యార్థులను గ్లోబల్ సిటిజన్‌గా తీర్చిదిద్దే విధానంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు చేబ్రోలు ఎంఈవో-1 హెచ్‌వీ ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి హెచ్‌ఎం ఎం ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో-2 ఆర్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.30వేల విలువైన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించటం అదృష్టమన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, కొక్కిలగడ్డ కిరణ్, దాసరి రత్నరాజు జి శ్రీరెడ్డి, ఇంటూరి సాంబిరెడ్డి తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారన్నారు. నాడు - నేడు ద్వారా పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి పాఠశాలల రూపు రేఖలను మార్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ

స్కూటీతో పాటు బంగారం అపహరణ

పెదకాకాని: పెదకాకాని గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరుగుతున్నాయి. పెదకాకాని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెండ్యాల శ్రీధర్ లారీ డ్యూటీకి వెళ్లాడు. గత శుక్రవారం ఆయన భార్య దుర్గ రాజమండ్రి పుట్టింటికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తీసి అందులో ఉన్న బంగారు వస్తువులు దొంగిలించారు. ఇంటి ఆవరణలో ఉన్న స్కూటీని దొంగిలించారు. సోమవారం ఇంటికి వచ్చిన దుర్గ తలుపులు తీసి ఉండటాన్ని గుర్తించి ఇంటిలోనికి వచ్చి చూసే సరికి బీరువా తెరచి అందులో ఉన్న వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంటిలో దొంగలు పడి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

పొన్నూరు: స్పందన కార్యక్రమంలో మండల ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కె. శ్రీకాంత్ సూచించారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకాకాని: జాతీయ రహదారిపై వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న షేక్ రజియా మృతి చెందగా ఆమె భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. పెదకాకాని పోలీసుల కథనం ప్రకారం గుంటూరుకు చెందిన షేక్ బాబర్‌కు భార్య రజియా, కుమారుడు అక్బర్, కుమార్తె సాంగినా సంతానం. షేక్ బాబర్ ఆదివారం విజయవాడలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి భార్య, పిల్లలతో స్కూటీపై బయలు దేరాడు. వారు ప్రయాణిస్తున్న స్కూటీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న పాస్ట్రల్ ట్రెనింగ్ సెంటర్ సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ఘటనలో స్కూటీపై ప్రయాణిస్తున్న షేక్ రజియా(37)పై లారీ చక్రాలు ఎక్కి అక్కడికక్కడే మృతి చెందగా భర్త బాబర్, కుమారుడు అక్బర్, కుమార్తె సాంగినాలకు గాయాలయ్యాయి. బంధువులకు సమాచారం అందించి ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆదివారం రాత్రి పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు షేక్ బాబర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం రజియ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మహిళలే అధికం

- తెనాలి నియోజకవర్గంలో ఓటర్లు 2,64,894
- పురుషులకన్నా మహిళా ఓటర్లు 9,192 మంది అధికం
- కొత్తగా ఓటు హక్కు పొందిన వారు 4,986 మంది
- తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడి

తెనాలి: స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 అనంతరం 91-తెనాలి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ సోమవారం ప్రచురించారు. విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,64,894 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళా ఓటర్లు 1,36,795 మంది, పురుష ఓటర్లు 1,27,603 మంది ఉన్నారు. అంటే పురుషులకన్నా మహిళా ఓటర్లు 9,192 మంది అధికంగా ఉన్నారు. మిగిలిన వారిలో ప్రవాస భారతీయ ఓటర్లు 170, త్రివిధ దళాల్లో పనిచేసే సర్వీస్ ఓటర్లు 288 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 38 మంది.

- తెనాలి పట్టణంలో మొత్తం ఓటర్లు 1,55,063 మంది కాగా, పురుష ఓటర్లు 74,584, మహిళా ఓటర్లు 80,446 ఉన్నారు.
- తెనాలి రూరల్ మండలంలో ఓటర్లు 64,666 కాగా, పురుష ఓటర్లు 31,301, మహిళా ఓటర్లు 33,361 మంది ఉన్నారు.
- కొల్లిపర మండలంలో ఓటర్లు 44,707 కాగా, పురుష ఓటర్లు 21,718, మహిళా ఓటర్లు 22,988 మంది ఉన్నారు.

లింగ నిష్పత్తి గతేడాది 1075 కాగా, ప్రస్తుతం 1072కు తగ్గిందని చెప్పారు.



ప్రఖర్ జైన్

కొత్తగా 4,986 మంది ఓటు హక్కు పొందారని సబ్ కలెక్టర్ తెలియజేశారు. కొత్త ఓటు నమోదుకు ఫారం-6, ద్వంద్వ పౌరసత్వం గలవారి ఓటు నిమిత్తం ఫారం-6ఏ, తీసివేతలకు ఫారం-7, సవరణలకు ఫారం-8 మొత్తం 42,007 వచ్చాయని తెలిపారు. వీటిలో ఓటు నమోదు కోరుతూ 12,569 దరఖాస్తులు రాగా, తొలగింపులకు 10,162, సవరణలకు 19,256 అర్జీలు వచ్చినట్టు వివరించారు. విచారణ అనంతరం చనిపోయినవారు 2,965 మంది, శాశ్వతంగా ఇక్కడ్నుంచి వెళ్లిపోయినవారు 4,692, ఒకటికన్నా ఎక్కువచోట్ల ఓటు ఉన్నవి 947, ఫొటోలు ఒకటే ఉన్నవి 1620, చిరునామా ఒకటే ఉన్నవి 75 ఓట్లను తొలగించామన్నారు. ఒకే ఇంటినంబరుపై పదికన్నా ఎక్కువ ఓట్లు ఉన్న 1105 గృహాలు/అపార్టుమెంట్లను సందర్శించి పరిష్కరించినట్టు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 173 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బీఎల్‌వోలు 93,695 ఇళ్లను సందర్శించి 2,59,515 మందిని సర్వేచేసినట్టు చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, పోలింగ్ కేంద్రాలవారీగా ప్రచారం, 'స్వీప్' ప్రచార కార్యక్రమాలతో అవగాహన సదస్సుల నిర్వహణ చేపట్టినట్టు వివరించారు. పోలింగ్ కేంద్రాలవారీగా బీఎల్‌వోలు ఓటరు జాబితాను ప్రచురించినట్టు తెలియజేశారు. ఓటు నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శివకుమార్
- కంచర్లపాలెంలో సచివాలయం,హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభం
- రూ.25 లక్షలకు పెంపుదల చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కంచర్లపాలెం(తెనాలి)/తెనాలిటౌన్ : ప్రజలకు అవసరమైన అన్నిరకాల సేవలను గ్రామస్థాయిలోనే అందించాలన్న ఆశయంతో సచివాలయ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, దేశంలో ఈ విధానం ద్వారా పారదర్శక పరిపాలనను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ మండలం కంచర్లపాలెంలోని నూతనంగా రూ.43.70 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.20.8 లక్షలతో నిర్మాణం చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంపుదల చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు.

సభకు గ్రామ సర్పంచ్ కోపల్లె మణిమ్మ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో గరిష్టంగా అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. కంచర్లపాలెం గ్రామంలో 501 మందికి పింఛన్లు వస్తున్నాయని, 170 మందికి ఇళ్లస్థలాల పట్టాలను ఇచ్చినట్టు చెప్పారు. రూ.2 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఆటోనగర్ మీదుగా ప్రత్యేక లైనుతో వీధిదీపాల కనెక్షను ఇచ్చినట్టు తెలియజేశారు. సచివాలయ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీలు, జిల్లా, ఏరియా ఆసుపత్రులను బలోపేతం చేసినట్టు చెప్పారు.



గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

అదనంగా పట్టణాల్లో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. అన్ని ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ కింద పేదలకు అందజేసే వైద్యసహాయ పరిమితిని ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని, తనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోపల్లె మణిమ్మ, సురేష్,మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు కొలవరపు దేవయ్య, పాదిలి శ్రీనివాసరావు, పీఆర్ డీఈ గుప్తా, ఏఈ వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ సుభాష్‌చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు, వీఆర్వో రాంబాబు, కొలకలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్, ఆరోగ్య సిబ్బంది, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి సువార్త స్వస్థత మహాసభలు

తెనాలి: క్రైస్ట్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో తెనాలిలో సువార్త స్వస్థత మహాసభలను నిర్వహించనున్నారు. మారీసుపేట రెండు గేట్ల మధ్య గల సెయింట్‌పాల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సోమవారం సాయంత్రం మహాసభల వాల్‌పోస్టర్‌ను రెవరెండ్ మేకల సునీల్, బ్రదర్ కూచిపూడి ప్రేమ్‌సాగర్ ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు సభలు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో, విజయవాడ ప్రాంతంలో దైవసేవలో గుర్తింపును పొందిన క్రైస్ట్ టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్, సిస్టర్ నిస్సిపాల్ సువార్త సభలో వాక్య పరిచర్య చేస్తారని తెలిపారు. ప్రముఖ సంగీత గాయకులతో ప్రత్యేక స్తుతి ఆరాధన ఉంటుందన్నారు. తెనాలి, పరిసరాల్లోని క్రైస్తవులంతా పాల్గొని దైవ ఆశీర్వాదం పొందాలని కోరారు. సోపాటి కిరణ్, చావలి అకుల్‌నాథ్, చావలి తేజోనాథ్, బొంత ప్రేమ్, పినపాటి కొండలరాజు, కొలవరపు వినోద్, తోట శ్రీనివాసరావు, వేమూరు రవి, ఆలపాటి సుధీర్, పినపాటి సునీల్‌పాల్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

లోన్ పేరిట ఆన్‌లైన్ మోసం

తెనాలిరూరల్: ఐదు నిమిషాల్లో రుణం ఇస్తామంటూ వచ్చిన మెసేజ్ క్లిక్‌చేసిన ఓ యువతి పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మ పేటకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఇటీవల సంక్రాంతి పండుగకు తెనాలి వచ్చిన యువతి సెల్‌ఫోన్‌కు ఐదు నిమిషాల్లో రుణం మంజూరై బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందంటూ మెసేజ్ వచ్చింది. దీంతో రుణం కోసం యువతి ఆ లింక్‌ను క్లిక్ చేయగా ఆమె బ్యాంక్ ఖాతాలోని రూ.10 లక్షలను దుండగులు తమ ఖాతాలోకి బదిలీ చేసుకున్నారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.